# గల్ఫ్ కార్మికులకూ బీమా ధీమా

- డిచ్‌పల్లి సభలో ప్రకటించిన సీఎం కేసీఆర్
- కాంగ్రెస్ వస్తే 3 గంటల కరెంటే దిక్కు
- ధరణి కావాల్నా.. దళారులు కావాల్నా?
- మీరే ఆలోచించుకోవాలన్న ముఖ్యమంత్రి
- బీఆర్ఎస్ ప్రభుత్వంతోనే రైతులకు మేలు
- బీడీ కార్మికులు, టేకేదార్లకు కొత్త పింఛన్లు



ప్రజా ఆశీర్వాద సభలో ప్రసంగిస్తున్న సీఎం కేసీఆర్, హాజరైన అశేష జనం



నిజామాబాద్, నవంబర్ 16 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)/డిచ్‌పల్లి తెలంగాణ వచ్చే నాటికి చెట్టుకొకరు, పుట్టకొకరు అన్నట్లుగా ఉండగా.. పదేండ్ల పాటు రాష్ట్ర సంపదను పెంచి ప్రజలకు పంచామని బీఆర్ఎస్ అధినేత, సీఎం కేసీఆర్ చెప్పారు. అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను తీసుకువచ్చినట్లుగా వివరించారు. రాష్ట్రం వచ్చిన కొత్తలో మూడునాలుగు నెలల పాటు మేధావులతో చర్చించి ప్రస్థానాన్ని మొదలు పెట్టామన్నారు. దగాపడిన రైతు మేలు కోసం వ్యవసాయాన్ని స్థిరీకరించినట్లు తెలిపారు. డిచ్‌పల్లి మండలం గాంధీనగర్ సమీపంలో గురువారం నిర్వహించిన నిజామాబాద్ రూరల్ నియోజకవర్గ ప్రజా ఆశీర్వాద సభలో ఆయన ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. సంపద ఎట్లా పెరిగితే అట్లా ఫించన్లను రూ.200 నుంచి రూ.2వేలకు చేశామని తెలిపారు. రాబోయే ప్రభుత్వంలో ప్రతి కుటుంబానికీ బీమా సౌకర్యం కల్పిస్తామని, గల్ఫ్ కార్మికులకు సైతం వర్తింపజేస్తామని సీఎం వెల్లడించారు.

**ధరణి తీసేస్తే దళారీ రాజ్యమే..**

ధరణిని తీసేస్తే రైతుబంధు ఎట్లా వస్తుందని రైతులను అడిగారు. కైలాసం ఆటలో పెద్దపాము మింగినట్లుగా మారుతుందని, కాంగ్రెస్ వస్తే ప్రజలకు ఎదురయ్యే ఉప్పెన ఇదేనంటూ చెప్పారు. గ్రామాల్లో చర్చ పెట్టి ఏ పార్టీ మంచిదో ఆలోచన చేయాలన్నారు. కేసీఆర్ కిట్ గురించి ఎవరూ గతంలో ఎవరూ ఆలోచించలేదన్నారు. ప్రభుత్వ దవాఖానలో ప్రసవం చేయించుకుంటే ఉల్టా డబ్బులిస్తున్నామని, దీంతో పేదలకు ఎంతో బాధ తప్పిందన్నారు. సీఎంఆర్ఎఫ్ ఎంతో మందికి అందించామన్నారు. కంటి వెలుగును కలలో కూడా ఊహించారా? అన్నారు. ఇవన్నీ మానవీయ కోణంలో అమలైన పథకాలని చెప్పారు. ప్రజల సొమ్ము ప్రజలకే చెందాలని కార్యరూపంలోకి వచ్చాయన్నారు. అద్భుతంగా అభివృద్ధి చెందిన రాష్ట్రం వెనుకకు పోవాల్నా? అంటూ ప్రజలను అడిగారు. లంబాడా బిడ్డలు ఇక్కడ ఎక్కువ ఉంటారని, తండాల్లో స్వయం పాలన తెచ్చింది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని తెలిపారు. రూరల్‌లో 50 తండాలు జీపీలుగా మారాయని, నిధులు నేరుగా అందిస్తున్నామని చెప్పారు. 3వేల ఎకరాల పోడు భూములను గిరిజనులకు పంచామని, మిగిలిన భూ సమస్యలను కూడా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. గిరిజనుల కోరికను ఎవ్వరూ తీర్చలేదని, ఎస్టీ రిజర్వేషన్‌ను 10 శాతానికి పెంచుకున్నామన్నారు. దీంతో విద్య, ఉద్యోగ అవకాశాలు పెరిగాయన్నారు. దీనిపై లంబాడా సోదరులు ఆలోచన చేయాలని కోరారు. త్వరలోనే మంచిప్ప రిజర్వాయర్ పూర్తవుతుందన్నారు.

**తెలంగాణలోనే నీటి తీరువా రద్దు..**

దేశంలో ఎక్కడా లేని విధంగా మన రాష్ట్రంలోనే నీటి తీరువాను రద్దు చేశామని కేసీఆర్ వెల్లడించారు. సమయానికి పెట్టుబడి సాయం, సాగుకు ఉచితంగా కరెంట్ ఇస్తున్నామని, రైతుబంధును పుట్టించిందే బీఆర్ఎస్ అన్నారు. నష్టం వచ్చినా ధాన్యాన్ని సర్కారే కొంటున్నదని తెలిపారు. దురదృష్టవశాత్తు రైతు చనిపోతే బాధిత కుటుంబానికి బీమా రూపంలో రూ.5లక్షలు అందిస్తున్నామన్నారు.

ప్రజలు కట్టిన పన్నులను రైతుబంధు రూపంలో దుబారా చేస్తున్నామని, సాగుకు 3గంటల కరెంటు చాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు బాజాప్తా, ఖుల్లా అంటున్నారని, పీసీసీ చీఫ్, మాజీ చీఫ్ రేవంత్, ఉత్తమ్ చెప్పిన విషయాన్ని కేసీఆర్ గుర్తు చేశారు. రైతుబంధు, 24 గంటల ఫ్రీ కరెంటు ఉండాలంటే బీఆర్ఎస్‌కు ఓటేసి బాజిరెడ్డి గోవర్ధన్‌ను గెలిపించాలని కోరారు.

## ఆదాయం పెరిగే కొద్దీ పథకాల పెంపు

రైతుబంధు ద్వారా ప్రజా ధనాన్ని దుబారా చేస్తున్నారని మాజీ పీసీసీ ఉత్తమ్ కుమార్‌రెడ్డి చెబుతున్నారని, పీసీసీ అధ్యక్షుడేమో 24 గంటల కరెంట్ వేస్ట్ అని, 3 గంటలిస్తే సరిపోతదని అంటున్నారని కాంగ్రెస్ తీరును కేసీఆర్ ఎండగట్టారు. అంజుమాన్‌కు అప్పులైతే తలుపులను పీక్కొని పోయిన రోజులను చూడలేదా? అని గుర్తుచేశారు. ఇప్పుడు వాళ్లే వచ్చి ఓట్లు అడుగుతున్నారని, దానికి మీరే సమాధానం చెప్పాలంటూ ప్రజలకు సూచించారు. దళితబంధు పుట్టించిందే బీఆర్ఎస్ ప్రభుత్వమని, ఈ పథకం గురించి ఎవరి మైండ్‌కూ రాలేదన్నారు. ఆదాయం పెరిగిన కొద్దీ పథకాలు పెంచుకున్నామని తెలిపారు. బీడీ కార్మికులకు ఏ ప్రభుత్వమైనా ఫించన్లు ఇచ్చిందా? అని కేసీఆర్ ప్రశ్నించారు. 16 రాష్ట్రాల్లో కార్మికులుంటే కేవలం తెలంగాణలోనే పింఛన్ ఇస్తున్నామన్నారు. వచ్చే ప్రభుత్వంలో కొత్త బీడీ కార్మికులు, టేకేదార్లకు కటాఫ్ డేట్ ఎత్తేసి పింఛన్ ఇస్తామన్నారు.

## బాజిరెడ్డి.. ప్రజల మనిషి

చేతిలో ఉన్నది జారగొట్టుకోవద్దని, నమ్మి మోసపోతే ఏం జరుగుతుందో ఆలోచన చేయాలని కేసీఆర్ ప్రజలకు సూచించారు. ఓటును ఆగమాగం వేయొద్దని హితవు పలికారు. బాజిరెడ్డి గోవర్ధన్ ప్రజల నాయకుడని సీఎం కేసీఆర్ కితాబిచ్చారు. ఆయన ఇల్లు నిత్యం ప్రజలతో కిటకిటలాడుతుందన్నారు. ఎంతమంది వచ్చినా వినతులు స్వీకరించి వారికి ఊరటను అందించే అనుభవం ఉన్న నాయకుడని, ప్రజా ఎమ్మెల్యేగా కీర్తించారు. బాజిరెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. రూరల్ అభివృద్ధి కోసం బాజిరెడ్డి వినుతులను వచ్చే ప్రభుత్వంలో తప్పకుండా నెరవేరుస్తానని కేసీఆర్ మాటిచ్చారు. మంచి నాయకుడిని గెలిపిస్తే, అంతా మంచే జరుగుతుందని తెలిపారు.

## ఆలోచించి ఓటెయ్యాలె..

స్వాతంత్ర్యం వచ్చి 75 ఏండ్లు గడుస్తున్నా రాజకీయ పరిణతి పెరగలేదని సీఎం కేసీఆర్ అన్నారు. పోటీ చేసే అభ్యర్థులు, వారి వెనుకాల ఉన్న పార్టీల చరిత్ర, నడవడిక, అవకాశమిస్తే వారు ఏం చేస్తారు.. అన్నది ఆలోచించి ఓటేస్తే ప్రజలు గెలవడం ప్రారంభిస్తారని చెప్పారు. ఎప్పుడైతే ప్రజలు గెలుస్తారో అప్పుడు ప్రజాస్వామ్యం పరిఢవిల్లుతుందన్నారు. రాయేదో, రత్నమేదో గుర్తించాలని కోరారు. బీఆర్ఎస్ 24 ఏండ్ల క్రితం ప్రజల కండ్ల ముందే పుట్టిందని, అందరం కలిసి ఉద్యమించి రాష్ట్రం తెచ్చుకున్నామన్నారు. 1956లో ఉన్న తెలంగాణను ఊడగొట్టిందే కాంగ్రెస్ పార్టీ అని, 58 ఏండ్లు బాధలు అనుభవించామన్నారు. 1969 ఉద్యమంలో కాంగ్రెస్ పార్టీ 400 మందిని పిట్టల్లా కాల్చిందన్నారు. 2004లో పొత్తు పేరిట చేతులు కలిపిందని, వారికి ఫలితం వచ్చినప్పటికీ తెలంగాణ ఇయ్యకుండా ధోకా చేసిందని, బీఆర్ఎస్‌ను చీల్చే ప్రయత్నం జరిగిందన్నారు. తిక్క పుట్టి కేసీఆర్ సచ్చుడో... తెలంగాణ వచ్చుడో అని ఆమరణ దీక్షకు దిగితే తెలంగాణ ఇచ్చినట్లే ఇచ్చి ఆగం చేశారని గుర్తుచేశారు. 33 పార్టీల సపోర్టుతో ఉద్యమం ఉవ్వెత్తున ఎగిసిన సందర్భంలో కాంగ్రెస్ పార్టీ 2014లో అనివార్యంగా ప్రత్యేక తెలంగాణను ఇచ్చిందని చెప్పారు. పదేండ్లలో ఏం జరిగిందో? 50 ఏండ్ల కాంగ్రెస్ పాలనలో ఏం జరిగిందో ఆలోచన చేయాలని కోరారు.

# రూరల్ అప్పుడెట్లుండె.. ఇప్పుడెట్లుంది

- పుష్కలంగా నిధులివ్వడంతో ఎంతో అభివృద్ధి చేశాం
- విమానాశ్రయ ఏర్పాటుకు నిధులివ్వండి..
- గులాబీ బాస్‌కు రూరల్ అభ్యర్థి, ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ మరిన్ని వినతులు



ప్రజా ఆశీర్వాద సభలో వేదికపై స్థానిక నాయకులతో కలిసి డ్యాన్స్ చేస్తున్న ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్



సభ అనంతరం సీఎం కేసీఆర్ హెలికాప్టర్‌లో వెళ్తుండగా బైబై చెప్తున్న ప్రజలు

డిచ్‌పల్లి, నవంబర్ 16: పదేండ్ల క్రితం నిజామాబాద్ రూరల్ ప్రాంతం ఎలా ఉండేది..? ఇప్పుడెలా ఉందో ప్రజలు గుర్తించాలని రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ కోరారు. సీఎం కేసీఆర్ పుష్కలంగా నిధులు ఇవ్వడంతోనే రూరల్‌ను అభివృద్ధి చేశామన్నారు. మండలంలోని గాంధీనగర్‌లో సమీపంలో గురువారం నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభలో బాజిరెడ్డి మాట్లాడుతూ.. మూడోసారి రూరల్ అభ్యర్థిగా తనకు అవకాశం కల్పించిన బీఆర్ఎస్ అధినేతకు కృతజ్ఞతలు తెలిపారు. తన కోరిక మేరకు రూరల్ నియోజకవర్గంలో ఇందల్వాయి, మోపాల్ మండలాలను ఏర్పాటు చేశారని, మరోసారి సీఎంతో కొట్లాడి రామడుగు మండలాన్ని సాధించుకున్నామని చెప్పారు. గుండారం గ్రామాన్ని కూడా మండలంగా చేయాలని ముఖ్యమంత్రికి విన్నవించారు. ధర్పల్లి మండల కేంద్రంలో ప్రభుత్వ దవాఖాన, డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. డిచ్‌పల్లిలో తెలంగాణ యూనివర్సిటీ ఉన్నందున ఇటీవలే డిగ్రీ కళాశాలను కూడా మంజూరు చేశారని, ఇంజినీరింగ్, పాలిటెక్నిక్ కళాశాలలు కూడా ఇవ్వాలని సీఎంను కోరారు. నియోజకవర్గ పరిధిలోని 50 తండాలను బీఆర్ఎస్ ప్రభుత్వం జీపీలుగా మార్చిందని, ఇది సీఎం కేసీఆర్ ఘనతేనని కొనియాడారు. గిరిజనులకు 3వేల 80 ఎకరాల పోడు పట్టాలు అందించామని తెలిపారు. జక్రాన్‌పల్లి మండలంలో విమానాశ్రయం ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్ వచ్చిందని, ఇందుకోసం అవసరమైతే రూ. 100కోట్లు మంజూరు చేయాలని ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేశారు. నియోజకవర్గంలో 17 చెక్‌డ్యాంలు, ఏడు బ్రిడ్జీలకు కేసీఆర్ నిధులు మంజూరు చేశారని తెలిపారు. నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్‌ని ఏర్పాటు చేయాలని కోరారు. రాష్ట్రవ్యాప్తంగా రూ. 17వేల కోట్ల రుణమాఫీ జరిగిందని, ఎన్నికల సంఘానికి కాంగ్రెస్ ఫిర్యాదు చేయడంతో రూ. 4వేల కోట్లు మిగిలిపోయాయని వెల్లడించారు. వాటిని కూడా మాఫీ చేయాలన్నారు. రూరల్‌లో ఎస్సీ, ఎస్టీ, బీసీలు ఎక్కువగా ఉన్నందున 10వేల కుటుంబాలకు గృహలక్ష్మి పథకం అందించాలన్నారు. 21వ ప్యాకేజీ పనులు చురుగ్గా సాగుతున్నాయని, మంచిప్ప రిజర్వాయర్ ముంపు గ్రామాల ప్రజలకు తగిన పరిహారం ఇప్పించాలని ముఖ్యమంత్రికి విన్నవించారు. రిజర్వాయర్ పూర్తి అయితే లక్షా 20వేల ఎకరాలకు సాగు నీరు అందుతుందని తెలిపారు. తనకు ఆర్టీసీ చైర్మన్‌గా క్యాబినెట్ హోదా కల్పించిన కేసీఆర్‌కు ధన్యవాదాలు తెలిపారు. తన హయాంలోనే 43వేల మంది ఆర్టీసీ సిబ్బందిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించడం సంతోషంగా ఉందని, వారు కేసీఆర్‌ను దేవుడిలా కొలుస్తున్నారని చెప్పారు. బాజిరెడ్డి గోవర్ధన్ వినతులకు సీఎం స్పందిస్తూ రాబోయే బీఆర్ఎస్ ప్రభుత్వంలో మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ఆశీర్వాద సభలో మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి, రాజ్యసభ సభ్యుడు సురేశ్‌రెడ్డి, మాజీ స్పీకర్ మధుసూదనాచారి, జడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు, మాజీ ఎమ్మెల్సీ వీజీ గౌడ్, నుడా చైర్మన్ ఈగ సంజీవరెడ్డి, ఐడీసీఎంఎస్ చైర్మన్ సాంబారి మోహన్, రైతు బంధు సమితి జిల్లా కోఆర్డినేటర్ మంజుల, జడ్పీటీసీ బాజిరెడ్డి జగన్, కమ్మ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌రావు, ఎంపీపీలు, జడ్పీటీసీలు, ఎంపీటీసీలు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.



ఆశీర్వాద సభలో మాట్లాడుతున్న నిజామాబాద్ రూరల్ అభ్యర్థి, ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్